




విధులపై నిబద్ధత పాటించాలి

ప్రజాశక్తి-నెల్లూరు: నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ కార్యదర్శులు విధుల పట్ల నిబద్ధత పాటిస్తూ క్రమశిక్షణగా మెలగాలని కమిషనర్ హరిత సూచించారు. స్థానిక 29/2 మహాత్మా గాంధీ నగర్ వార్డు సచివాలయాన్ని కమిషనర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. ఆస్తి పన్ను, యూజర్ ఛార్జీల వసూళ్లను సచివాలయ కార్యదర్శులు మరింత వేగవంతం చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి క్షేత్ర స్థాయిలో సంక్షేమ పథకాలు అందేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా రీ సర్వే పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన డ్రెస్ కోడ్ యూనిఫామ్ ధరించాలన్నారు.ఆదేశించారు.కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ సత్తార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్

కోర్టులో చోరీ కేసు సిబిఐ స్పీడ్..!

రాజకీయ నేతలు ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజం. ఒక్కోసారి శృతి మించి ఆరోపణలు చేయడం, కుటుంబాలు, వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బ తినేలా ఆరోపణలు చేయడం చూస్తున్నాం. సర్వేపల్లి నియోజక వర్గంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డిపై ఎంఎల్ఎ కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన ఆరోపణలు ఢిల్లీ వరకు చేరాయి. కేసు ప్రస్తుతం నెల్లూరు కోర్టులో ఉంది. ఇటీవల కోర్టులో దొంగలు పడ్డారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఫైళ్లు మాయమయ్యాయి. జడ్జి హైకోర్టుకు ఫిర్యాదు చేయడంతో సిబిఐ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసుకు సంబంధించి విచారణ వేగంగా సాగుతోంది. శుక్రవారం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విచారణకు హాజరయ్యారు. మరికొందరిని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరి ధీమాలో వారు ఉన్నారు. ఈ కేసు రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

◆'సోమిరెడ్డి' విచారణకు హాజరు
◆జిల్లాలో తొలిసారి హడలు పుట్టిస్తోన్న సిబిఐ
◆రాజకీయనేతల్లో అలజడి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సర్వేపల్లి నియోజకవర్గంలో టిడిపి, వైసిపి వార్ ఢిల్లీ వరకు వెళ్లింది. జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితోపాటు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి పలుమార్లు విమర్శలు చేసుకున్నారు. ఇదే సమయంలో ఇరుపార్టీల నేతలు వ్యక్తిగతంగా ఆరోపణలు చేసుకున్నారు. 2019 ఎన్నికలకు ముందు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో ఎంఎల్ఎగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి అనేక ఆరోపణలు చేశారు. చంద్రమోహన్‌రెడ్డికి మలేషియా, సింగపూర్‌లో వెయ్యి కోట్ల రూపాయలు అక్రమాస్తులు ఉన్నాయని, వివిధ కంపెనీల్లో సోమిరెడ్డి ఆయన భార్య కుమారులు డైరెక్టర్లుగా ఉన్నారని ఆరోపణలు చేశారు. ఈ సమయంలో టిడిపి నేతలు ర్యాలీ నిర్వహించి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కేసు పెట్టారు. నకిలీ పత్రాలు సృష్టించి, వ్యక్తిగత ప్రతిష్ట భంగం కలిగించేలా చేశారని ఆరోపణలు చేశారు. ఈ కేసు నెల్లూరు కోర్టులో ఉంది. ఈ కేసు ఫ్యూలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత కోర్టులో దొంగతనం జరిగింది. ఇద్దరు దొంగలు పడి కోర్టులో రికార్డులు మాయం చేశారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఉన్న కేసు రికార్డులు మాయం చేయడంతో అనేక అనుమానాలు వచ్చాయి. ఏసి విజయారావు విచారణ చేపట్టి దొంగల పనిగా తేల్చారు. ఈ కేసు సరిగా విచారణ జరగలేదని జడ్జి హైకోర్టుకు 250 పేజీల నివేదిక సమర్పించారు. కోర్టులో దొంగతనం జరిగిన కేసులో సిబిఐ విచారణకు హైకోర్టుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సిబిఐ విచారణను స్వాగతించారు. తమ ప్రభుత్వమే సపోర్టు చేసిందని చెప్పారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సిబిఐ విచారణతో న్యాయం జరుగుతుందని తెలిపారు. చెన్నయ్‌లోని సిబిఐ అధికారులు ఈ కేసును వేగంగా విచారణ చేస్తున్నారు. అనేక మంది సాక్షులను విచారణ చేస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విచారణకు హాజరయ్యారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో సిబిఐ ఎస్‌పి నిర్మలాదేవి, ఎఎస్‌పి అనంతకృష్ణన్‌ను ఆయన కలిశారు. జరిగిన విషయాలు తెలియజేశారు. మరోసారి లిఖిత పూర్వకంగా ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. రాజకీయాల్లో ఆరోపణలు శృతి మించిన పరిస్థితి ఎలా ఉంటుందనడానికి ఈ కేసు ఉదాహరణగా తెలుస్తోంది. సిబిఐ విచారణ సాగుతుండడంతో అటు టిడిపి, ఇటు వైసిపి నేతల్లో ఆందోళన నెలకొంది. సోమిరెడ్డి, కాకాణి ఇరువురిలో ఏం జరుగుతుందోనని భయం మొదలైంది. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ కోర్టులో దొంగతనానికి పాల్పడిన వ్యక్తులకు శిక్ష తప్పదని చెప్పారు.

కేసులో శిక్ష తప్పదు- సోమిరెడ్డి

నెల్లూరులోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో సిబిఐ అధికారుల విచారణ అనంతరం మీడియాతో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడారు. చెన్నయ్ నుంచి వచ్చిన సిబిఐ ఎస్‌పి నిర్మలా దేవి, ఎఎస్‌పి అనంతకృష్ణన్ నన్ను పిలిపించారన్నారు. గంట పది నిమిషాల పాటు తనతో మాట్లాడారన్నారు. కోర్టులో జరిగిన ఫైల్ దొంగతనం, నకిలీ డాక్యుమెంట్ల విషయంలో వారి అనుమానాలను నివృత్తి చేసుకున్నారని తెలిపారు. తనను సోమవారం లేదా మంగళవారం మళ్లీ పిలిచి అధికారికంగా నోటీసులు ఇచ్చి రాతపూర్వక సమాధానం తీసుకుంటామని తెలిపారు. సామాన్య మానవుడికి ఈ కేసు వివరాలు చెప్పినా అసలు దొంగ ఎవరో తెలిసిపోతుందన్నారు. ఇంత ముఖ్యమైన కేసులో ఫైలు దొంగతనం జరిగితే నెల్లూరు పోలీసులు కనీసం వేలి ముద్రలు, పాదముద్రలు సేకరించలేదని, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించలేదని సాక్షాత్తు జిల్లా న్యాయమూర్తి హైకోర్టుకు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారని, ..ఈ విషయం విచారణ జరిపిన పోలీసులకు సిగ్గుచేటన్నారు. ఇది రెండు పార్టీల మధ్య ఇద్దరు వ్యక్తుల మధ్య కేసు కాదు..న్యాయస్థానానికి, నిందితులకు మధ్య జరుగుతున్న ప్రతిష్టాత్మక కేసు అన్నారు.. ఢిల్లీలో ఉపహార్ థియేటర్ కేసు తరహాలో అసలు నేరం కన్నా సాక్ష్యాధారాలు మాయం చేసినందుకే ఎక్కువ శిక్ష పడుతుందని భావిస్తున్నానని తెలిపారు. కోర్టులో సాక్ష్యాధారాలను మాయం చేయడం ద్వారా తప్పు చేసినోళ్లను ఎవరూ కాపాడలేరని, తన కుటుంబ పరువు ప్రతిష్టలను దెబ్బతీసేందుకు అప్పుడు నకిలీ పత్రాలు తయారు చేయించారు.. ఇప్పుడు సాక్ష్యాధారాలు మాయం చేశారని ఆరోపించారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

దళితుల వద్ద తీసుకున్న భూములకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-కందుకూరు: పోర్టు రోడ్డు నిర్మాణం కోసం దళితుల దగ్గర తీసుకున్న భూములకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని ఏపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రామాయపట్నం పోర్టు పరిధిలో పారిశ్రామిక హబ్ కోసం భూములు తీసుకుంటున్న చేవూరు గ్రామ రైతులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల కోసం రాష్ట్ర ప్రభుత్వం వేలాది ఎకరాల భూములను రైతుల దగ్గర అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి నిరుపయోగంగా మారుస్తున్నారు. అక్కడ పరిశ్రమ రావడం లేదని, ఇక్కడ భూములు కోల్పోయిన రైతులు కూలీలుగా మారి పొట్టనింపుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ, లేపాక్షి వానిక్‌లలో పరిశ్రమలు రాలేదన్నారు. భూములు కోల్పోయిన రైతులు జైలు గోడల మధ్య జీవిస్తున్నారన్నారు. చేవూరు, రావూరు గ్రామాలలో రైతుల పరిస్థితి అలాకాకుండా, ప్రజా అభిప్రాయాన్ని మన్నించి, అటవీ భూములను వ్యవసాయానికి పనికి రాని భూములను పరిశ్రమల కోసం తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోర్టు నిర్వాసితులకు, 2013 ఆర్‌ఆర్ చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పోర్టు రోడ్డు నిర్మాణం కోసం దళితుల దగ్గర తీసుకున్న భూములకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎస్‌ఎ గౌస్, జి.వి.కటేశ్వర్లు, జివిబి కుమార్, టిడిపి నేతలు పి.మురళి, హరిబాబు ,తిపేంద్ర, ప్రసాద్, సిపిఎం నాయకులు ఎన్.వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య , రాజగోపాల్ పాల్గొన్నారు.

వైసిపి సేవాదళ్ అధ్యక్షుడికి అభినందనలు

ప్రజాశక్తి-నెల్లూరు: వైసిపి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులుగా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిని నియమించడంతో వైఎస్ఆర్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ నెల్లూరు జిల్లా సెక్రటరీ జి.వి.శివయ్య మర్యాద పూర్వకంగా ఆయనతో భేటీ అయి అభినందనలు తెలియజేశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

బుచ్చి తహశీల్దార్ సస్పెన్షన్

భూ రికార్డులు తారుమారు



ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రైతు భూమి రికార్డులు మార్చి వైసిపి నేతకు కట్టబెట్టినందుకు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం తహశీల్దార్ ప్రమీలపై సస్పెన్షన్ వేటు పడింది. మండలంలోని మినగల్లు గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి ఎన్నో ఏళ్లుగా భూమి ఉంది. అక్కడే వ్యవసాయం చేసుకుంటున్నారు. రీ-సర్వేలో ఆయన భూమిని వైసిపికి చెందిన సర్పంచ్ భర్త బుర్రు రాము పేరుతో మార్పు చేశారు. తన భూమి రికార్డులు మార్పు చేశారని, రైతు అధికారుల చుట్టు తిరుగుతున్నారు. అందులో భాగంగానే ఇటీవల స్పందనలో రైతు సుబ్బారెడ్డి జెసి కూర్మానాధ్‌కు ఫిర్యాదు చేశారు. తన రికార్డులు మార్పు చేశారని, ఆధారాలతో జెసికి సమర్పించారు. వెంటనే ఆయన విచారణకు ఆదేశాలు జారీ చేశారు. జెసి ఆదేశాలతో ఆర్‌డిఒ ఇటీవల విచారణ చేపట్టి నివేదిక సమర్పించారు. తహశీల్దార్ ప్రమీల గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త బుర్రు రాము పేరుతో నిబంధనలకు విరుద్ధంగా రీసర్వేలో నమోదు చేసినట్లు నిర్ధారణ అయింది. తహశీల్దార్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ చక్రధర్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారసత్వంగా తనకు సంక్రమించిన భూమిని తహశీల్దార్ పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని సర్పంచ్ భర్త పేరుపై మార్చిందని బాధిత రైతు సుబ్బారెడ్డి తెలిపారు. సమస్య పరిష్కారం కోసం కాళ్లు అరిగేలా తహశీల్దార్ చుట్టూ తిరిగిన ఆమె స్పందించలేదని చెప్పుకొచ్చారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయడం సంతోషంగా ఉందని అన్నారు.

మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలి

పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పి.బాబు రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు: రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల్లో మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని, ఆయా పాఠశాలల్లోని ఖాళీలు భర్తీ చేయకపోవడం వల్ల నిరుపేద వర్గానికి చెందిన విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పి.బాబురెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పలు మున్సిపల్ , కార్పొరేషన్ పాఠశాలల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణీకరణ పెరగడం వలన జనాభా విపరీతంగా పెరిగిందన్నారు. అందుకు అనుగుణంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో పెరిగిన పిల్లల సంఖ్యకి అవసరమైనటువంటి కొత్త పాఠశాలలు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సంఖ్యకి అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేసి వెంటనే ఉపాధ్యాయులను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మున్సిపల్ పరిధిలో ఎంఇఒ లను కార్పొరేషన్ పరిధిలో డివైఇఒ పోస్టులు ఇచ్చి ప్రమోషన్స్ ద్వారా పర్యవేక్షణ అధికారులను నియమించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ అకౌంట్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ నేటి వరకు అమలుకు నోచుకోకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు గతంలో రావాల్సిన బకాయిలు, సిసిఎ అకౌంట్స్ లో లక్షల్లో మురిగిపోతున్నాయన్నారు. పిఎఫ్ విషయంలో అన్ని మున్సిపాలిటీల్లో ఒకే పద్ధతి లేకపోవడం వలన ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సర్వీస్ రూల్స్ లో ఉన్న లోపాలను తొలగించి వెంటనే అర్హత కలిగిన వాళ్లకి ప్రమోషన్స్ కల్పించాలన్నారు. మున్సిపల్ అధికారులు గతంలో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమ అభ్యర్థులైన పి.బాబురెడ్డిని టీచర్ ఎంఎల్‌సిగా, మీగడ వెంకటేశ్వర రెడ్డి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. రాజకీయాలకు సంఘాలకి అతీతంగా ఉపాధ్యాయులందరూ ఒకటి కావాల్సిన సందర్భంగా ఆసన్నమైందన్నారు. ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వల్ల ఉపాధ్యాయులు తమ జీతాలను ఒకటవ తేదీన తీసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎంసి అచ్చయ్య, జిల్లా కార్యదర్శి ఎన్. మధుసూదనరావు, నగర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె సనావుల్లా, ఎస్‌డి జాఫర్ మోహిద్దీన్, విజయ్ కుమార్, మోహన్ రెడ్డి, కెవిఎస్‌బి శర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.బాబురెడ్డి

నిరుపేదకి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-కందుకూరు: శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ పట్టణంలోని కొత్తపాలెంలో శుక్రవారం నిరుపేదకు ఆర్థిక చేయూతను అందించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం మీడియా చైర్మెన్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారి ఆకలి తీరుద్దాం వారి కళ్ళల్లో ఆనందం చూద్దాం అనే నినాదంతో శ్రీ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అనునిత్యం సేవా కార్యక్రమాల నిర్వహిస్తున్నారన్నారు. పట్టణంలో ఇటీవల ఆరోగ్యం బాగోలేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న పాశం మాలాద్రి అనే వ్యక్తికి నెలకు సరిపడా బియ్యం, సరుకులను అందజేశారు. పాశం మాల్యాద్రి ఆర్థిక ఇబ్బందులను కష్ణ బలిజ యువజన జిల్లా ఇన్‌ఛార్జ్ ఆనందమోహన్ మా దష్టికి తీసుకురావడంతో ఆ కుటుంబ పరిస్థితిని పరిశీలించి ఆర్థిక చేయూత ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు, ఇన్నమూరి శ్రీనివాసులు,కష్ణ, దుర్గా హరిప్రసాద్, నీలిశెట్టి నరసయ్య, కష్ణమోహన్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కళ్యాణమస్తుతో లబ్ది

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: సదరం సర్టిఫికెట్ కోసం గ్రామ సచివాలయల్లో ప్రజలు నమోదు చేయించుకోవాలని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిణి, మండల ప్రత్యేకాధికారి కనకదుర్గా భవాని చెప్పారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఆమె మాట్లాడారు. వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫాకు కూడా అర్హులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి వివాహమైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి,మైనార్టీలందరూ అర్హులేనన్నారు. వారు సచివాలయాల్లో మ్యారేజి సర్టిఫికెట్లు పొందాలన్నారు. పదో తరగతి పాసై అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు దాటిన వారందరూ అర్హులన్నారు. రూ.లక్ష నుంచి లక్షా 20వేల వరకు ఆయా పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ఇంకా మైనార్టీలకు లక్ష అందజేయనున్నట్లు వివరించారు. వికలాంగులకు రూ.1.50 లక్షలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఇంకా ఈ-శ్రమ కార్డు పొందిన వారికి వైఎస్ఆర్ కళ్యాణమస్తు కింద రూ.40వేలు అదనంగా చెల్లిస్తుందన్నారు.



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎంఎల్ఎ

సిబ్బంది బాధ్యతగా పని చేయాలి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేస్తే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సాధ్యమవుతుందని కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అయ్యవారిపల్లె గ్రామ పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేసిన పథకాలకు సంబంధించిన లబ్ధిపై ప్రజలకు వివరించారు. ఎస్‌సి కాలనీలో ఎక్కువమందికి ప్రభుత్వం అందిస్తున్న రైతుభరోసా సొమ్ము జమ అయింది. మంచాల పెదమాలకొండయ్య తనకు పొలం లేదని, అయినా డబ్బులు తమకు వచ్చినట్లు చెప్పారు. పొదుపు మహిళలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.. విద్యార్థుల హాజరుశాతం గురించి తెలుసుకున్నారు. మధ్యాహ్నభోజనం ఎలా ఉందని అడిగారు. భోజనం, కూరలను రుచి చూశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గుడ్లు పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ డేగా వెంకటేశ్వర్లు, జెడ్‌పిటిసి ఇంటూరి భారతి, ఎంపిపి పొనుగోటి మౌనిక, తహశీల్దార్ కెవిబిటి సుందరమ్మ, ఎంపిడిఒ షేక్ రఫీక్ అహ్మద్‌తో పాటు అధికారులు, వైసిపి నాయకులు బచ్చు మాల్యాద్రి, ఇంటూరి హరిబాబు, బాపతు మాలకొండారెడ్డి, కుంబాల క్రాంతి, వరికూటి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ మహిధర్‌రెడ్డి

ఇంటూరి నాగేశ్వరరావు, రాజేష్‌లకు బెయిల్

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు దుర్ఘటనకు సంబంధించి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్‌ని నిన్న సాయంత్రం పోలీసులు హైదరాబాదులో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం తెల్లవారుజామున 2గంటల ప్రాంతంలో నేతలిద్దరిని పోలీసులు కందుకూరుకు తీసుకొచ్చారు. మొదట టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి తరువాత ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం కందుకూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమాదేవి ఎదుట హాజరు పరిచారు. పోలీసులు నమోదు చేసిన కేసులో తేడాలు ఉన్నాట్లు గుర్తించారు. ఇద్దరికీ చెరొక 10వేల రూపాయల వ్యక్తిగత పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేస్తు జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. కేసు విషయంలో అనుక్షణం సూచనలు అందిస్తూ వెన్నుదన్నుగా నిలిచిన పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పార్టీ లీగల్ సెల్ టీమ్‌కు, నెల్లూరు పార్లమెంటు, కందుకూరు నియోజకవర్గ లీగల్ సెల్ టీమ్‌కు, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఇతర నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు: పందలపాడు గ్రామంలో మహజన సోషలిస్టు పార్టీ జెండా ఎంఎస్‌పి జిల్లా సీనియర్ నాయకులు వర్ల దేవదాసు శుక్రవారం ఆవిష్కరించారు. మహజన సోషలిస్ట్ పార్టీ ఆవిర్భవించి దశాబ్దకాలం అయిన సందర్భంగా వర్ల దేవదాసు మాదిగ మహజన సోషలిస్ట్ పార్టీ జెండా ఆవష్కరించి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో అణగారిని కులాల ఆత్మగౌరవం కోసం మంద కష్ణ మాదిగ ఏర్పాటుచేసిన పార్టీ మహజన సోషలిస్ట్ పార్టీ అని అన్నారు.కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా కోకన్వీనర్ కాంతారావు మాదిగ, ఎంఎస్‌పి మండలం ఇన్‌ఛార్జి వర్ల బ్రహ్మయ్య మాదిగ, వర్ల కిషోర్, యోబు శ్రీకాంత్, అనీల్, సన్నీ లెనిన్ పాల్గొన్నారు.

టిడిపి నిరసన

ప్రజాశక్తి-కందుకూరు: ప్రజలు, ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కడానికి రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ ఒకటిని తీసుకురావడం జరిగిందని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ చెప్పారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ ఒకటి కాపీలను పట్టణంలో దగ్ధం చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి టిడిపి కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అంద జేశారు. అనంతరం జిఒ కాపీలను అబ్దుల్ అజీజ్‌తో పాటు తెలుగుదేశం పార్టీ కందుకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, టిడిపి నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్, ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో తగలబెట్టారు. అనంతరం వారు మాట్లాడారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.సుబ్బానాయుడు, దామా మల్లేశ్వరరావుతో పాటు పోడపాటి సుధాకర్, మాదాల లక్ష్మీనరసింహం, జి.మోషే, తెలుగు మహిళ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముచ్చు రాజ్యలక్ష్మి, కల్లూరి శైలజ పాల్గొన్నారు.



ప్రతులను దగ్ధం చేస్తున్న దృశ్యం

దుర్ఘటన ప్రదేశం పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు: ప్రింటు, ఎలక్ట్రానిక్ మీడియాలలో అవాస్తవాలు ప్రచురించడం ప్రసారం చేయడం సరైనది కాదని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మీడియా ప్రతినిధులకు హితవు పలికారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రెస్ అకాడమీ చైర్మన్ నెల్లూరు నుంచి ఒంగోలు వెళ్తూ మార్గమధ్యలో కందుకూరులో గత నెల 28వ తేదీన జరిగిన తొక్కిసలాటా దుర్ఘటన ప్రదేశాన్ని పరిశీలించారు. దుర్ఘటన ఎలా జరిగింది అందుకు గల కారణాలను సిఐ వెంకటరావు చైర్మనుకు వివరించారు. అనంతరం చైర్మన్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పోలీసుల వైఫల్యం వలన దుర్ఘటన జరిగిందని కొన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో వార్తలు రావడం సమంజసం కాదన్నారు. పోలీసులు ఏ విధంగా వైఫల్యం చెందారు స్పష్టం గా తెలియజేయాల్సి ఉందన్నారు. వాస్తవాలను వక్రీకరించడం సరైనది కాదని హితవు పలికారు.

భూహక్కు రీసర్వే పనులు వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకం నిర్వహణలో భాగంగా నగర వ్యాప్తంగా రీ సర్వే పనులను వేగవంతం చేయాలని కమిషనర్ హరిత ఆదేశించారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం నిర్వహణపై కార్పొరేషన్ కార్యాలయం కౌన్సిల్ మందిరంలో వార్డు సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, రెవెన్యూ సెక్రటరీలతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, రెవెన్యూ సెక్రటరీలు సమన్వయంగా విధులు నిర్వహించి రీ సర్వే పనులను పూర్తి చేయాలని సూచించారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భ.ని.కా సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు: భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన క్యాలెండర్ డిప్యూటీ లేబర్ కమిషన్ ఆఫ్ నెల్లూరు వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు . శుక్రవారం నగరంలోని లేబర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు అందరూ కూడా గుర్తింపు కార్డులను అప్లై చేసుకోవాలన్నారు. గుర్తింపు కార్డులు రెన్యువల్ చేసుకోవాల్సిన వారు వెంటనే రెన్యువల్ చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో భవన నిర్మాణ నగర కార్యదర్శి కాయం శ్రీనివాసులు, నగర అధ్యక్షులు ఆవులు పెంచలయ్య పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు


ప్రజాశక్తి-వలేటివారిపాలెం: రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా గ్రామ సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధి చేకూర్చుతున్నట్లు కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకే అందించే పథకాల సొమ్ము వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నాయని, ఎక్కడా లంచం అనే ప్రస్తావనే లేదని స్పష్టం చేశారు. మండలంలో నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం ఎంపిడిఒ షేక్ రఫీక్ అహ్మద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ మాట్లాడుతూ 2019-20లో 5943 పెన్షన్లు ద్వారా రూ.1.41 కోట్లు ఇస్తుండగా, ఇప్పుడు 6724 పెన్షన్లతో రూ.1.82 కోట్లు ప్రతినెలా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. గతం కంటే పెన్షన్లు పెంచిన విషయం వాస్తవమైనప్పటికీ, ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తున్నాయని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి పొనుగోటి మౌనిక, జెడ్‌పిటిసి ఇంటూరి భారతి, సర్పంచులు ఇరపని సతీష్, యాళ్ల సుబ్బరాజ్యం, మన్నం వెంగమ్మ, సాదు శ్రీలత, డేగా వెంకటేశ్వర్లు, అనుమోలు అమరేశ్వరి, వివిపాలెం సొసైటీ చైర్మన్ వడ్లమూడి రమేష్‌బాబు, వైసిపి నాయకులు అనుమోలు వెంకటేశ్వర్లు, పరిటాల వీరాస్వామి, నాగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ఇంటూరి హరిబాబు, మాజీ సర్పంచ్ ఉన్నం వెంకటేశ్వర్లు, నూకతోటి వీరనారాయణ పాల్గొన్నారు.



పింఛన్ అందజేస్తున్న ఎంఎల్ఎ మహిధర్‌రెడ్డి

గ్రూపు-1 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-నెల్లూరు: ఎంతో ప్రాముఖ్యత కలిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకో కుండా పటిష్టంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఎపి పబ్లిక్ సర్వీసు కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీ జి.వసంత కుమార్ జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జిల్లాలో రేపు నిర్వహించబోయే గ్రూపు-1 స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ విషయంపై శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో ఎపి పబ్లిక్ సర్వీసు కమిషన్ అసిస్టెంట్ సెక్రెటరీ శ్రీ జి. వసంత కుమార్, లైజనింగ్ అధికారులు, ఛీఫ్ సూపరింటెండెంట్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సందర్భంగా నుడా వైస్ ఛైర్మన్ శ్రీ టి. బాపి రెడ్డి మాట్లాడుతూ, కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్ బాబు ఆదేశాల మేరకు జిల్లాలో 8వ తేదీన నిర్వహించబోయే గ్రూపు-1 స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై ఈ రోజు లైజనింగ్ అధికారులు, ఛీఫ్ సూపరింటెండెంట్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించామన్నారు. జిల్లా కేంద్రంలో 16 పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశామన్నారు. ఈ పరీక్షలకు 6,045 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. తొలుత గ్రూపు-1 స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ భాగంగా లైజనింగ్ అధికారులు, ఛీఫ్ సూపరింటెండెంట్లు ఏపీపీఎస్సీ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాల్సిన విధులను ఎపి పబ్లిక్ సర్వీసు కమిషన్ అసిస్టెంట్ సెక్రెటరీ జి. వసంత కుమార్, సెక్షన్ ఆఫీసర్ పి. ధీల్లేశ్వర రావు, బాల రాజు వివరించారు. సమావేశంలో 16 పరీక్షా కేంద్రాల లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి

కందుకూరులో అన్నదానం

ప్రజాశక్తి-కందుకూరు: శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొండసముద్రానికి చెందిన నల్లమోతు హరిబాబు, ఆదిలక్ష్మి మనుమరాలు మన్నం గీతాన్విత పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో విప్పగుంట రోడ్డు వద్ద ఉన్న పేదవారికి ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం మీడియా చైర్మెన్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారి ఆకలి తీరుద్దాం వారి కళ్ళల్లో ఆనందం చూద్దాం అనే నినాదంతో శ్రీ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అనునిత్యం సేవా కార్యక్రమాల నిర్వహిస్తున్నారన్నారు. పేదవారి సేవలో నిరంతరం కొనసాగాలని రవ్వా శ్రీనివాసులను కోరారు. కార్యక్రమంలో ఇన్నమూరి శ్రీనివాసులు, చీదెళ్ల కృష్ణ పాల్గొన్నారు.

కరకంబాక రామయ్య వర్ధంతి



ప్రజాశక్తి-కోవూరు : సిపిఎం నాయకులు కరకంబాక రామయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సీతాపోలయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గండవరపు శేషయ్య మాట్లాడుతూ కరకంబాక రామయ్య పార్టీకి ఎంతో కృషి చేశాడని తెలిపారు. భూ పోరాట యోధురని ఆయన ఆశయాలు సాధిస్తామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మారుబోయిన సుబ్బారావు, కాలేషా, రమేష్, సురేంద్ర, చాన్‌బాషా, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు బాధ్యతగా పనిచేసే విధంగా పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలియజేశారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు బాధ్యతగా పనిచేయటం లేదని పలు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కావున వారి పనితీరును సమగ్రంగా పరిశీలించాలన్నారు. అలాగే సచివాలయం పనివేలలు తప్పని సరిగా పాటించాలని, కార్యాలయంలో అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా అధికారులు తనిఖీకి వచ్చినపుడు ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. సురక్షిత మంచినీటి సరఫరా గ్రామ ప్రజలకు అందించాలని, దోమల నివారణకు ప్రత్యేక పారిశుధ్య పనులు తరచూ చేపట్టాలని ఆయన కోరారు. ఆత్మకూరు మండలంలోని కరటంపాడు షెడ్‌ను మోడల్ ట్రైనింగు సెంటర్‌గా ఎంపికైందని, కావున ఈ షెడ్‌కు కావలసిన వసతుల ఏర్పాటుకు రూ.2 లక్షలు మండల అధ్యక్షులు కేటాయింపు చేశారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని మండలానికి మంచి గుర్తింపును తీసుకొని రావాలని కోరారు. సమావేశంలో విస్తరణ అధికారి టి.ఉషారాణి అందరూ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్లపై సమావేశాలు నిషేధం



ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : నిబంధనల ప్రకారం రాష్ట్రంలో జాతీయ రహదారులపై పట్టణ ప్రధాన రోడ్లపై సభలు సమావేశాలు ఎట్టి పరిస్థితుల్లో నిర్వహించడానికి అనుమతులు లేవని ఆత్మకూరు డిఎస్‌పి కోటారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులకు లేకుండా సభలో సమావేశాలు పెట్టుకోవాలన్న ముందస్తుగా అనుమతి తీసుకుంటే సమావేశం నిర్వహించే స్థలం ప్రజలకు ఇబ్బంది కలిగిస్తుందా లేదా ఆ స్థలంలో ఎంతమంది మహిళలు, పురుషులు, ఎంతమంది హాజరౌతారని పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నెంబర్ 1 ఇది ప్రతి ఒక్కరికీ వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివశంకరరావు ఉన్నారు.

ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత కోసం ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ బాగుండాలి.. అందులో మనం ఉండాలి.. అన్న నినాదంతో ప్రభుత్వం కొనసాగిస్తున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ ఆరోగ్య సిబ్బంది చేపడుతున్న ఈ కార్యక్రమం ప్రతిఒక్కరూ సహరించి ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ పాల్గొని సంపూర్ణ ఆరోగ్యానికి భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి, మండల నాయకులు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

బాలకృష్ణమ్మ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు ఎపిటిఎఫ్ ద్వితీయ అధ్యక్షుడు విద్యా రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం మార్పు బాలకృష్ణమ్మ 10వ వర్ధంతి సందర్భంగా ఆత్మకూరులోని ఎల్లారపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆత్మకూరు మండల శాఖ అధ్యక్షుడు సిహెచ్ నరేందర్‌రెడ్డి నివాళు లర్పించారు. ఈ సమావేశంలో సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ మార్పు బాలకృష్ణమ్మ జీవితం అంతా ప్రజాఉద్యమాలతో గడిపారని తెలిపారు. ఉద్యమాల హక్కుల కోసం జైలు జీవితం గడిపారని శాసన మండల సభ్యునిగా ఉపాధ్యాయుల సమస్యలతో పాటు రైతాంగ సమస్యలను కూడా సభలో ప్రస్తావించే వారన్నారు. ఉపాధ్యాయులకు రీ గ్రూపింగ్ స్కేలు అప్రయత్న యాంత్రిక పదోన్నతి 010 పద్దు కింద జీతాలు లాంటి అనేక సౌకర్యాలు సాధించి పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ సోమవరపు భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్ వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.రామసుబ్బారెడ్డి, జిల్లా సబ్ కమిటీ సభ్యులు సిహెచ్ మల్లికార్జున, మండల గౌరవ అధ్యక్షుడు వై.శివరామిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శివరాంరెడ్డి, జిల్లా బాధ్యులు చంద్రమోహన్ రెడ్డి, ఫణి కుమార్ తదితరులున్నారు.

వింజమూరులో ధనుంజయరెడ్డి పర్యటన

ప్రజాశక్తి-వింజమూరు : పట్టణంలో శుక్రవారం ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు ధనుంజయరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పరిశీలకులుగా 25 మంది ఉన్నామని తెలిపారు. వారి బాధ్యత ప్రతి నియోజకవర్గంలో పర్యటిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ వాలంటీర్ల వ్యవస్థ సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అనే క్రమంలో వింజమూరుకి వచ్చానని తెలిపారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉంటే పరిశీలిస్తామని ఆయన తెలియజేశారు. గణపం బాలకృష్ణారెడ్డి, గువ్వల కృష్ణారెడ్డి, స్థానిక బంగ్లాలో వైసిపి నాయకులను మాట్లాడారు. వీరిలో సర్పంచ్ సృజన, సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు, మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, ఎంపిపి ఎనగనూరి మోహన్ రెడ్డి తదితరులున్నారు.

సిబ్బంది సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా భావించి "పోలీస్ వెల్ఫేర్ డే" నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి సిహెచ్ విజయరావు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా బడ్జెట్ రూపకల్పన

పజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ 2023 –24 ఆర్థిక సంవత్సరం నూతన బడ్జెట్ అంచనాలను ప్రణాళికాబద్ధంగా రూపొందించాలని కమిషనర్ హరిత ఆదేశించారు. కార్యాలయంలో కమిషనర్ చాంబర్లో నూతన ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదన సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-వెంకటాచలం : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా విద్యార్థులకు ఆప్టిట్యూడ్, ఇతర ఉద్యోగ నైపుణ్యాలపైన ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిశాయి. శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ ఆచార్య పి.రామచంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య జి.విజయానంద్ బాబు విద్యార్థులను అభినందించారు.

నానో యూరియాతో తగ్గుతున్న పెట్టుబడి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగించడం ద్వారా వ్యవసాయ ఖర్చులు తగ్గే అవకాశం వుందని ఇందుకూరుపేట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ. రాజ్ కుమార్ సూచించారు. శుక్రవారం తోటపల్లిగూడూరు మండలం కోడూరులో డాక్టర్ వైఎస్‌ఆర్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి యు. గీతాకుమారి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎడిఎ రాజ్ కుమార్, ఇఫ్కో జిల్లా అధికారి వి. లక్ష్మీ నారాయణలు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళపై నిర్బంధం

ప్రజాశక్తి-కొడవలూరు : మతిస్థిమితం లేని మహిళను ఓ వ్యక్తి గత కొన్ని నెలలగా తన ఇంటిలో నిర్బంధించిన సంఘటన బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని పెద్దూరు ప్రాంతంలో చోటుచేసుకుంది. లంకేశ్వరరావు అనే వ్యక్తి తన ఇంటిలో మహిళను నిర్బంధించాడన్ని చుట్టుపక్కల వారు గమనించి ఐసిడిఎస్ అధికారులకు అందించారు. ఐసిడిఎస్ సిబ్బంది ఆ మహిళను పోలీసుల సహాయంతో ఇంటి నుండి బయటకు తీసుకొచ్చారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు మహిళ ఆత్మకూరుకు చెందిన తేజవతిగా గుర్తించారు. ఆమె యల్లాయపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్లు తెలుస్తుంది. అయితే మస్థిమితం లేకపోవడంతో గత కొన్ని నెలలుగా ఆమె విధులకు హాజరు కావడం లేదు. ఈ క్రమంలోనే బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన లంకేశ్వరరావు ఆమెను తన ఇంట్లో నిర్బంధించినట్లు స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో ఇంటి నుండి మహిళ అరుపులు వినిపిస్తుంటాయని వారు అధికారులకు తెలిపారు. గతంలో సైతం తేజవతి తప్పిపోతే కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆమెను కనుగొని తన తండ్రికి అప్పజెప్పినట్లు బుచ్చిరెడ్డిపాలెం సిఐ కోటేశ్వరావు వెల్లడించారు. ప్రస్తుతానికి ఆమెను మహిళా సంరక్షణ అధికారులకు అప్పగించామని దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.

విద్యారంగంలో 'జెబి'ది చెరగని ముద్ర



కొమ్మినేనిశ్రీనివాసరావును సత్కరిస్తున్న వినయ్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-కావలి

విద్యారంగంలో కావలి జవహర్ భారతి విద్యాసంస్థలు చెరగని ముద్ర వేశాయని, సేవే పరమావధిగా ఎందరో నిరుపేద విద్యార్థులకు విద్యాదానం చేసిన ఘనత జవహర్ భారతి విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ రామచంద్రారెడ్డికే దక్కిందని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కావలి జవహర్ భారతి జూనియర్ కళాశాలకు విచ్చేసిన కొమ్మినేనికి విద్యార్థులు, అధ్యాపకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమంలో కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర ఉన్న కావలి జవహర్ భారతి విద్యాసంస్థలను సందర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు. "డాక్టర్ వైఎస్‌ఆర్ లైఫ్ టైం అచీవ్మెంట్ పురస్కారం" ఈ కళాశాలకు లభించడం అభినందనీయమన్నారు. నిరుపేదలు విద్యకు దూరం కాకూడదనే సంకల్పంతో డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి వేసిన బీజం మహావృక్షంలా మారి ఎందరికో విద్యాదానం చేస్తోందన్నారు. విద్య, వైద్యరంగాలకు మాజీముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎంతో ప్రాధాన్యతనిచ్చి ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అలాగే గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రధానంగా మనబడి నాడు–నేడు పథకంతో కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను వినియోగించుకుంటూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా తడ వద్ద ఉన్న శ్రీ సిటీ పారిశ్రామిక వాడను విద్యార్థులందరూ సందర్శించి, అక్కడ ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. అనేక దేశాలకు చెందిన పరిశ్రమలు శ్రీసిటీలో ఉన్నాయని, వీటన్నింటినీ పరిశీలించి అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్ కుమార్ రెడ్డి మాట్లా డుతూ సువిశాల 100 ఎకరాల విస్తీర్ణంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, రెండు ఇంజనీరింగ్ కళాశాలలతో జవహర్ భారతి విద్యాసంస్థలు సేవలందిస్తున్నాయన్నారు. తమ తండ్రిగారి బాటలో పయనిస్తూ నిరుపేదలకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా తమ విద్యా సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. 110 దేశాల్లో జవహర్ భారతి విద్యాసంస్థల విద్యార్థులు వివిధరంగాల్లో పని చేస్తున్నా రని, ఇది తమ కళాశాలలకు ఎంతో గర్వకారణంగా ఆయన పేర్కొన్నారు. ముందుగా జవహర్ భారతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ రామచంద్రారెడ్డి చిత్రపటానికి కొమ్మినేని శ్రీనివాసరావు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి వెంకటేశ్వర ప్రసాద్, జవహర్ భారతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సన్నీ శామ్యూల్‌రాజు, ఇసి మెంబర్ కూనం తాతిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.మాల్యాద్రి, తెలుగు అధ్యాపకురాలు సీతాకుమారి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిని గెలిపించాలి



మాట్లాడుతున్న మిరగ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-సీతారామపురం

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వంపై పోరాడే అభ్యర్థులకే పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్టం కట్టాలని నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల వెన్ను విరిచే నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. దీనిని అరికట్టడానికి పిడిఎఫ్ అభ్యర్థులు శాసనమండలిలో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు జీతాలు సైతం సకాలంలో చెల్లించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులపై ఎంత కక్షగట్టి చర్యలు చేపడుతుందో అర్థం అవుతుందని తెలిపారు. సిపిఎస్ రద్దు చేస్తానని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని తుంగలోకి తొక్కి కమిటీల ద్వారా కాలయాపన చేస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రతి పట్టభద్రుడు బుద్ధి చెప్పాలన్నారు. ఉద్యోగుల పిఎఫ్ డబ్బులు స్వప్రయోజనాలకు వాడుకోవడంతో పాటు సైతం ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలకు ఖర్చు చేసుకోవడం చాలా దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. కొత్త ఉద్యోగాలు కల్పిస్తామని గతంలో జాబ్ క్యాలెండర్ ద్వారా తెలిపిన ప్రభుత్వం ప్రస్తుతం 50 వేల టీచర్ పోస్టులను లేకుండా చేసిందన్నారు. తాను ఎంఎల్‌సిగా గెలిస్తే నిరుద్యోగ, ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై శాసనమండలిలో నిత్యం పోరాటం చేస్తానన్నారు. శనివారం మండలంలోని అన్ని పాఠశాలలను సందర్శిస్తానన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎడమ తిరుపతయ్య, యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొల్లపల్లి వెంకటేశ్వర్లు, ప్రతాప్, భోగ్యం శ్రీనివాసులు, పిసిఎం. కొండయ్య, అన్నంగి ప్రసాద్, ఎ.వెంకటేశ్వర్లు, రంతయ్య, జయరామి రెడ్డి, ఎ.వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న భూ కబ్జాదారులు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని కంద్రికలో పేదలకు ప్రభుత్వం ఇచ్చి సాగు చేసుకుంటున్న సిజెఎఫ్‌ఎస్ భూములను అదే గ్రామానికి చెందిన వైసిపి నేత ఆక్రమించాడని బాధితులు ఆరోపిస్తున్నారు. మా భూములు ఆక్రమణలో ఉన్నాయని భూములకు సంబంధించిన డీ ఫారం పట్టాలు ఉన్నాయని, తమకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారుల వద్దకు వెళితే తమపై దాడికి యత్నించారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న డాక్టర్ శివకల్పన

ప్రజాశక్తి-ఉదయగిరి

గురుకుల పాఠశాల విద్యార్థుల కు గండిపాలెం పిహెచ్ వైద్యాధికారిణి ఎం.శివకల్పన శుక్రవారం ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. వారికి మందులను పంపిణీ చేసి కొంతమందికి చికెన్‌పాక్స్ లక్షణాలు ఉన్న వారిని పరీక్షించి వారికి వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి సోకినవెంటనే విద్యార్థులను తోటి విద్యార్థుల నుంచి వేరు చేసి ఒకేగదిలో ఉంచి వారికి తగిన సదుపాయాలు కల్పిస్తూ ఉండాలని సూచించారు. స్కాబీస్ విద్యార్థులకు తగు మందులతో చికిత్స నిర్వహించి వారికి తగు, సూచనలు ఇచ్చి, వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలియజేశారు. విద్యార్థుకు ఆహార పదార్థాలు, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఉతికిన బట్టలను సూర్యరశ్మి తగిలే విధంగా ఆరవేయాలని సూచించారు. తడిబట్టలు ధరించ రాదన్నారు. విద్యార్థుల వసతి గృహాలను పరిశీలించి ప్రిన్సిపాల్‌కు తగిన సలహా సూచనలిచ్చారు. భోజనశాలలను పరిశీలించి భోజనం పంపిణీ విధానాన్ని క్వాలిటీని పరిశీలించారు. ఎవరైనా విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి కలసాపటి.వెంకటసుబ్బయ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ నౌషాద్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ధనరాజ్, ఆరోగ్య పరిరక్షకుడు అక్బర్, చంద్రమౌళి, విజయ్ కుమారి, అరుణ పాల్గొన్నారు.

10న 'చలో కావలి'



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-కావలి

దళితులు, దళిత మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ఖండిస్తూ 10వ తేదీన "చలో కావలి" కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టిడిపి ఎస్‌సిసెల్ నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం కావలి పార్టీ కార్యాలయంలో కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశానుసారం రాష్ట్ర పార్టీ కార్యదర్శి జెన్ని రమణయ్య ఆధ్వర్యంలో టిడిపి దళిత సంఘం నాయకులతో పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నేతలు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుండి, దళితులపై జరుగుతున్న దారుణాలు, మారణకాండలు, ఆడబిడ్డలపై అత్యాచారాలు విపరీమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులందరూ పేదవారు, మధ్య తరగతి వారు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారేనని, వారికి రావాల్సిన లోన్లు ఏమైనా వస్తున్నాయా అని ప్రశ్నించారు. దళితులకు అండగా ఉండాల్సింది పోయి వారి స్వయం ఉపాధి కోసం ఉపయోగించాల్సిన నిధులను దారి మళ్లించడానికి మనసు ఎలా వచ్చిందని జగన్ మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. దళితులపై హత్యలు మానభంగాలు చేస్తూ శారీరకంగా, మానసికంగా కృంగదీశారని ఆవేదన వ్యక్త పరిచారు. చలో కావలిని అడ్డుకోవడానికి హౌస్ అరెస్టులు వంటి కార్యక్రమాలు అధికార పార్టీ వారు చేస్తే జరగబోయే పరిణామాలకు కావలి ఎంఎల్‌ఎ ప్రతాప్‌కుమార్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, రాష్ట్ర ఎస్‌సిసెల్ అధికార ప్రతినిధి ఆత్మకూరి నాగరాజు, పార్లమెంటు ఎస్‌సిసెల్ ప్రెసిడెంట్ కాకి ప్రసాద్, నియోజకవర్గ ఎస్‌సిసెల్ అధ్యక్షులు దావులూరి దేవకుమార్, రాష్ట్ర టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దార్ల శివకుమార్, మండల పార్టీ ఎస్‌సి సెల్ అధ్యక్షులు దాసు, పట్టణ పార్టీ ఎస్‌సిసెల్ అధ్యక్షులు అక్కిలిగుంట సూర్యప్రకాష్, ఎస్‌సి సంఘ ముఖ్య నాయకులు ఇనగంటి అనిల్, నేలపాటి మాల్యాద్రి, దాసరి మహేంద్ర, అజయ్, వేణు తదితరులున్నారు.

8న అఖిలపక్ష రైతుసదస్సు

ప్రజాశక్తి-మర్రిపాడు

సోమశిల హై లెవెల్ కెనాల్ పనులు పూర్తి చేయాలని 8వ తేదీన మర్రిపాడు మండల కేంద్రంలో జరిగే అఖిలపక్ష రైతు సదస్సును జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య కోరారు. మెట్ట ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగ పడే ప్రాజెక్టును మూడు ప్రభుత్వాలు పూర్తి చేయక పోవడం మెట్ట ప్రాంత ప్రజలను పక్షపాత ధోరణితో చూస్తున్నారన్నారు. అఖిలపక్ష రైతు సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య పాల్గొంటారన్నారు. ఈ సదస్సుకు అన్ని ప్రజా సంఘాల నాయకులు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అల్లూరులో సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-అల్లూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపిపి దర్శిగుంట శశిరేఖ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై కూలంకుషంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీదేవి మాట్లాడుతూ ఆయా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. గ్రామాలలో తాగునీటి సమస్య పారిశుధ్యం తదితర సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. కార్యక్రమాలు తహశీల్దార్ శ్రీరామకృష్ణ, మండల ఉపాధ్యక్షులు గుమ్మడి సురేంద్ర యాదవ్, ఇఒపిఆర్‌డి పెంచల వీరేంద్ర తదితరులున్నారు.

యాచకుడికి మంచం వితరణ

ప్రజాశక్తి-కావలి : సంయుక్త సేవాసంస్థ ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో శుక్రవారం కావలి పట్టణం నివాసులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, సంయుక్త సేవాసంస్థ గౌరవ సభ్యులైన ఎం.అజిత్ బాబు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. అనంతరం కాలేరుగుంట సమీపంలో రోడ్డుపక్కన పట్టలతో ఇళ్లు నిర్మంచుకొని కటిక నేలపై పడుకుంటున్న వృద్ధ అంధయాచకుడు మేకల. కన్నయ్యకి ఇనుప మంచం వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సభ్యులు అజిత్ బాబు – సంపూర్ణ దంపతులు, సంస్థ ఉపాధ్యక్షుడు గంధం ప్రసన్నాంజనేయులు, సంస్థ గౌరవ సభ్యులు ఎం.చంద్రశేఖర్ వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ సలహాదారులు ఎం.మాలకొండారెడ్డి, సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, కుట్టు శిక్షణ మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి-మర్రిపాడు : జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను అర్హులైన పేదలను గుర్తించి భూపంపిణీ చేయడానికి శనివారం నుండి గ్రామ సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ హేమంత్ కుమార్ ప్రకటనలో తెలియజేశారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించి ఉన్నామని వాటిని గ్రామసభలలో ప్రజలకు చదివి వినిపించి నిజమైన పేదలకు అసైన్మెంట్ కమిటీ ద్వారా భూమి పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేస్తామన్నారు. అందులో సమస్యలను, అభ్యంతరాలను సేకరించాలని జెసి సూచించారన్నారు. గ్రామసభలు జనవరి 6నుండి 13వరకు జరుగనున్నట్లు తెలిపారు.

జాబ్‌కార్డులకు ఆధార్ తప్పనిసరి

ప్రజాశక్తి-వరికుంటపాడు : జాతీయ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులు కలిగిన వారు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేయించుకోవాలని ఎపిఒ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో 800 పైగా జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం కాలేదని, అందుకు సంబంధించిన ప్రక్రియ సాగుతుందన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఎపిఒ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి ఆధారం అనుసంధానం చేశారు. కార్యక్రమంలో ఇసి హజరత్, సిఒ సాయి, టి ఎ మునయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులపై ఖండన

ప్రజాశక్తి-కందుకూరు : పోలీసులు, జగన్మోహన్ రెడ్డి సేవకులు కాదని, ప్రజాసేవకులుగా పని చేయాలని టిడిపి నాయకులు అన్నారు. శుక్రవారం కందుకూరు టిడిపి కార్యాలయంలో నెల్లూరు, ప్రకాశం జిల్లాల నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు షేక్. అబ్దుల్ అజీజ్, అద్దంకి, కొండెపి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్, డోల వీరాంజనేయ స్వామి, టిడిపి నేతలు కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగేశ్వరరావు, రాజేష్, తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర కార్యదర్శి దామంచర్ల సత్య, రాష్ట్ర కార్యదర్శి జెన్నీ రమణయ్య ఉన్నారు.

పొగాకు పంట పరిశీలన



ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని పొగాకు పంటలను పొగాకు బోర్డు అధికారులు, పొగాకు కంపెనీల సి.టి.ఆర్.ఐ శాస్త్రవేత్తలతో కూడిన రైతు మిత్ర బృందం శుక్రవారం గుండెమడకల, డిసిపల్లి, బైరవరం, నందవరం గ్రామాల్లో సందర్శించారు. పొగాకు పంటలను క్యూరింగ్‌ను పరిశీలించి పొగాకు రైతులకు సూచనలు సలహాలిచ్చారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజనల్ ఆఫీస్ ఆక్షన్ సూపరింటెండెంట్ సిద్ధిరాజు మాట్లాడుతూ పొగాకులో సి.టి.ఆర్.ఐ. సిఫార్సు చేసిన మందులను తగిన మోతాదులో వాడాలని, పొగాకులో మందులను ఎక్కువగా వాడటంవలన పురుగు మందుల అవశేషాలు ఏవైనా డిమాండ్ తగ్గే అవకాశం ఉందని, లింగాకర్షక బుట్టలు, పసుపు జిగురు అట్టలు వాడడం, బంతి మొక్కలు వంటి ఎర పంటలను వేసుకోవాలని తెలియజేశారు. పూర్తిగా పక్వానికి వచ్చిన లేత గోధుమ రంగు ఆకులనే రేలచాలని పచ్చి ఆకును నేలపై కాకుండా తార్పలిన్‌పై దించి అల్లాలని, పచ్చి అకులో గడ్డి, ఇతర అన్య పదార్థాలు లేకుండా శుభ్రత పాటించాలని తెలిపారు. బ్యారెన్‌లో ఇనుప జాలి అమర్చుకోవాలని, తప్పనిసరిగా క్యూ రోమీటర్ వాడాలని సూచించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్, జి.వెంకట్రావు ఐటిసి మేనేజర్, ఏ.రామాంజనేయులు పి.ఎస్.ఎస్.మేనేజర్, యు.శ్రీనివాసులు జి.పి.ఐ మేనేజర్, జి ఆంజనేయులు మేనేజర్, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ముఖ్యమంత్రి 'జగన్'



మాట్లాడుతున్న కోవూరు ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

పేదల పాలిటి పెన్నిధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజాభిమానం పొందాడని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గంగపట్నం గ్రామంలో గడపగడప పకు మన ప్రభుత్వం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. గంగపట్నం పల్లిపాలెంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. జిల్లాలో నూతనంగా 11 వేల 618 పింఛన్లు మంజూరు కాగా, కోవూరు నియోజకవర్గంలో 1557 మందికి 43 లక్షల 24 వేల పింఛన్లు పంపిణీ చేశామన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఈ సందర్భంగా పింఛన్లను పంపిణీ చేశారు. వైసిపి సూళ్లూరుపేట పరిశీలకులు బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండలాల గ్రామ వాలంటీర్లు కమిటీ సభ్యులు వైసిపి నేతలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరిశీలకులు బాలచంద్రారెడ్డి రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామ వాలంటీర్లు స్థానిక నేతలు గృహసారథులతో సమైక్యంగా వ్యవహరించి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలన్నారు. అదేవిధంగా తమతమ కుటుంబ సభ్యులతో సమన్వయం ఏర్పరచుకొని పని చేయాలన్నారు. 2024 ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని తిరిగి గెలిపించుకోవాలని అదేవిధంగా ప్రసన్నకుమార్ రెడ్డిని విజయపథంలో నిలపాలని కోరారు. గ్రామ వాలంటీర్లు తాము చేస్తున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి కృషిని స్థానిక శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సేవలపై ప్రశంసలు గుప్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులరెడ్డి, డిఎల్‌డిఎ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, రంజిత్ కుమార్‌రెడ్డి, జెడ్‌పి వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, ఫణింద్ర నాయుడు, పంబాల జనార్దన్ రెడ్డి, శిగినం సుబ్రహ్మణ్యం, సర్పంచ్ సాయినిరంజన్, డి మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, గూడూరు ప్రభాకర్ రెడ్డి, రావూరి సర్పంచ్ వెంకట శేషయ్య, తహశీల్దార్ సుబ్బయ్య, ఎంపిడిఒ కల్పన తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్‌నాయుడు

ప్రజాశక్తి-కావలి

కావలి గుండెమడుగుల దేవదానం మెమోరియల్ హాస్పిటల్లో శుక్రవారం డాక్టర్. ఎన్.ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో వారి కుమారుడు, ఎన్.సాయివర్షన్ జన్మదినం సందర్భంగా కిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నెల్లూరు వారి సౌజన్యంతో ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా డాక్టర్ కుమారులు సాయివర్ష భారీ కేక్ కట్ చేసి, ఘనంగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ నాయుడు మాట్లాడుతూ ఇప్పటి వరకు 123 ఉచిత మెగా వైద్య శిబిరములు నిర్వహించామని తెలిపారు. ముఖ్యంగా పేద బడుగు బలహీన వర్గాలు సూపర్ స్పెషాలిటీ వైద్యము కోసం వ్యయ ప్రయాసాలతో, ఇతర దూరప్రాంతాలకు పోలేక అనేక ఇబ్బందులు పడుతున్నందు వల్ల ఇలాంటి, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి నామని తెలియజేశారు. ఈ ఉచిత శిబిరంలో డాక్టర్ ఎ.వి.రెడ్డి, ప్లాస్టిక్ సర్జన్, డాక్టర్ సాహెబ్ పీర్, గుండెవ్యాధి నిపుణులు, డాక్టర్.మస్తాన్‌వలి, నెఫ్రాలజిస్ట్, డాక్టర్ ఉదయ్ కిరణ్, న్యూరాలజిస్ట్, డాక్టర్ వంశీకృష్ణ, గాస్ట్రోసర్జన్, డాక్టర్ శశిభరత్ రెడ్డి, పల్మనాలజీ , డాక్టర్ శ్రీహర్ష జనరల్, డైబెటాలజిస్ట్, డాక్టర్ మంజీర, చర్మవ్యాధి నిపుణులు, డాక్టర్ సుధీర్‌కుమార్ గుండె వ్యాధి నిపుణులు, డాక్టర్ వినయ్ వినోద్ బాబు, దంత వైద్య నిపుణులు, మొత్తం10, మంది డాక్టర్లు పాల్గొని, అన్ని రకాల వైద్య పరీక్షలు, నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరంలో మొత్తం 585మంది పాల్గొన్నారు. పి.ఆర్.ఒ ఆనంద్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొని సేవలు అందించారు.


ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా పద్మజ

ప్రజాశక్తి-కొడవలూరు : బుచ్చిరెడ్డిపాలెం ఇన్‌ఛార్జి తహశీల్దా రుగా శుక్రవారం పద్మజ బాధ్యతలు చేపట్టారు. రీ సర్వేలో అవక తవకలు జరిగాయని తహశీల్దారు ప్రమీలను కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు పద్మజ బాధ్యతలు చేపట్టారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు ప్రశంసలు

ప్రజాశక్తి-వెంకటాచలం : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు జాతీయ స్థాయి లో ప్రశంసలు అందడంతో ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి వారిని శుక్రవారం అభినందించారు. విఎస్‌యు ఎన్‌ఎస్‌ఎస్‌సెల్ తరపున 10మంది విద్యార్థులు 29 డిసెంబర్ 2022 నుంచి 4 జనవరి 2023 వరకు అందించనున్న గిరి యూనివర్సిటీ బేలూరు వారు నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు ఎస్‌పి నగదు ప్రోత్సాహకం



ప్రజాశక్తి-కొడవలూరు

వృద్ధుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుళ్లకు ఎస్‌పి విజయారావు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. వెంకటేశ్వరపురంకు చెందిన యానాదయ్య (68) అనే వృద్ధుడు ఇంట్లో వారిపై అలిగి వచ్చేశారు. ఈ క్రమంలోనే నార్తురాజుపాలెం జాతీయ రహదారి పక్కనున్న పొలాల్లో గురువారం బురదలో కూరుకుపోయి కనిపించారు. హైవే మొబైల్ విధుల్లో ఉన్న మొబైల్ వాహన కానిస్టేబుల్ ఎల్.సుధాకర్, కొడవలూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ జి.వెంకటప్రసాద్ వృద్ధుడు ప్రాణాపాయ స్థితిలో ఉండడాన్ని గమనించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని వృద్ధుడిని బురదలో నుంచి తీసి స్నానం చేయించి కోవూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మానవత్వంతో కానిస్టేబుళ్ల చొరవ చూపి వృద్ధుడి, ప్రాణాలు కాపాడినందుకు గానూ సుధాకర్, వెంకట ప్రసాద్లకు శుక్రవారం నెల్లూరులో ఎస్‌పి విజయారావు నగదు ప్రోత్సాహకం అందజేశారు.



సుబ్బరాజు పర్యటన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు డివిజన్ పరిధిలోని శాఖా పరమైన అభివృద్ధి పనులను దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థ డైరెక్టర్ ఎన్.వి.ఎస్.సుబ్బరాజు శుక్రవారం డివిజన్‌లో పర్యటించారు. అనంతరం ఆత్మకూరు విద్యుత్ శాఖ కార్యాలయంలో డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులు గురించి విద్యుత్ బకాయిలు సమీక్ష సమావేశం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకూరు పరిధిలోని విద్యుత్ కేంద్రాన్ని, జగనన్న కాలనీలలోని జరుగుతున్న విద్యుత్ లైన్ల ఏర్పాటును పరిశీలించారు. సమావేశంలో ఆత్మకూరు డివిజనల్ ఇంజనీరు బి.జనార్ధన్, ఆత్మకూరు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు సురేష్, మండలాల విద్యుత్ ఎఇలు పాల్గొన్నారు.

విన్నర్స్‌గా ఎఎస్‌ఆర్ కళాశాల



ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్

విక్రమసింహపురి అంర్ కళాశాలల జోనల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ఎఎస్‌ఆర్ కళాశాల విజయం సాధించింది. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని ఎస్‌ఆర్‌జె డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో ఎస్‌ఆర్‌జెడి కళాశాల జట్టుపై ఎఎస్‌ఆర్ కళాశాల జట్టు విజయ సాధించింది. రెండు జట్లు ఫిబ్రవరిలో విక్రమ సింహపురి యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగే సెంట్రల్ జోన్ పోటీల్లో పాల్గొంటాయని కళాశాల పిడి, పోటీల నిర్వాహక కార్యదర్శి సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వర కుమారి, యూనివర్సిటీ అబ్జర్వర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, లైబ్రేరియన్ టి.శ్రీనివాసులు రెడ్డి, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కేసు కొట్టివేత

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు రూరల్ పోలీసు 2016లో నమోదు చేసిన కేసులో వాస్తవాలు రుజువు కానందున జడ్జి పి.పూర్ణమా దేవి కేసు కొట్టివేస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. వాది తరపున సీనియర్ న్యాయవాది తిరుమలరావు వాదించారు.